క్లుప్తంగా

మంత్రిని కలిసిన కిరణ్‌కుమార్‌గౌడ్



జనగామ: రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగంగౌడ్‌తో కలిసి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ కలిసి తన బయోడేటాను అందజేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్ర స్థాయిలో పని చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కష్టపడే వారికి భవిష్యత్‌లో మంచి గుర్తింపు ఉంటుందని మంత్రి అన్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో కొన్ని సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు సీఎంఆర్ఎఫ్, ఎల్‌ఓసీ, పేద కుటుంబాలకు ఆర్థికసాయ కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. అనంతరం జనగామ నియోజకవర్గ తాజా రాజకీయ పరిణామాలపై ఆరా తీసినట్లు చెప్పారు.

ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్



శ్రీకాంత్, అధ్యక్షుడు



కుమార్, కార్యదర్శి

తరిగొప్పుల: ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడిగా బైరీ శ్రీకాంత్‌ని తోటి జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఎన్నికలను నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా సొంటెక్క కుమార్, ఉపాధ్యక్షులుగా తాటి శ్రీనివాస్, కోశాధికారిగా మూల మహేశ్, సలహాదారుడుగా మడికొండ తిరుమలేషు, సహాయ కార్యదర్శి నాగపురి కిషన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన తోటి జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇప్పించడంలో ముందుండి ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు.

వివాహిత అదృశ్యం



సునీత

బచ్చన్నపేట: కుటుంబ కలహాలతో వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పయ్యావుల సునీత (35) భర్త రాజుతో గొడవపడి ఆదివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. దీంతో భర్త రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు రాజు నంబర్ 9908337982, లేదా ఎస్సై నంబర్ 8712368205 లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. అదృశ్యమైన వివాహితకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సురభి కళాకారుడి మృతి



ధర్మేంద్ర (ఫైల్)

చిల్పూరు: సురభి నాటక ప్రదర్శనలో తబలా కళాకారుడు వనారస ధర్మేందర్ (44) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలో స్థిరపడిన సురభి నాటక కళాకారుల్లో ఒకరైన ధర్మేంద్ర తబలా వాయించడంతో దిట్ట. ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. అతని మృతి పట్ల సురభి కళాకారులు రేకాందర్ ప్రసూన, రేకాందర్ నాగబాబు, భానుప్రసాద్, కోటేశ్వరరావు, మాధవరావు, మధుసూదన్, సాయి, ఉష, హరిణి, పుష్పలత, సులోచన, వేణుమాధవ్, నాగరాజులు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అదే విధంగా చిల్పూరు ఆలయ అభివృద్ధి శాశ్వత ధాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, జీడి రమేష్, జీడి జాన్, కేశోజు నిరంజన్, బాసెట్టి జయప్రకాష్ తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్ శివారులో కారును వెనుకనుంచి లారీ ఢీకొట్టిన ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన మౌనిక, ఆమె కుమారుడు యశ్వంత్, అత్త స్వరూప ముగ్గురు కారులో వరంగల్‌లో బంధువు సంవత్సరీకానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం హైదరాబాద్‌కు కారులో బయలు దేరి వెళ్తున్న క్రమంలో రాఘవాపూర్ శివారు రైస్‌మిల్లు సమీపాన జాతీయరహదారిపై వెనుకాల వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పల్టీ కొట్టి రోడ్డు పక్కన ఉన్న చెట్లలోకి దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు గాయపడగా చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం

- పాఠశాలలు, ఆలయాల సమీపంలో మద్యం సేవిస్తున్న వైనం
- అసౌకర్యానికి గురవుతున్న స్థానికులు
- పోలీసులు నిఘా పెంచాలని డిమాండ్



శివునిపల్లి శివారులో వ్యవసాయభూమి వద్ద ఖాళీ మద్యం సీసాలు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మందుబాబులు ఇష్టారాజ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతుండగా ప్రజలు, మహిళలు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాలలు, ఆలయాల సమీపంలో, వ్యవసాయ భూముల వద్ద మద్యాన్ని తాగుతుండగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం అయిందంటే చాలు స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలతో పాటు పలు గ్రామాల్లో మద్యం ప్రియులు విచ్చలవిడిగా బహిరంగంగా మద్యం తాగుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తూ విచ్చలవిడిగా మద్యం సీసాలను పగులగొడుతున్నారు. వ్యవసాయ భూముల వద్ద మద్యం తాగి సీసాలను పగులగొడుతుండగా సీసావక్కలు ఆ ప్రాంతాల్లో తిరిగే రైతులకు, పశువులకు గుచ్చుకుని అవస్థలకు గురవుతున్నారు.

అడ్డాలుగా ఖాళీ స్థలాలు

గ్రామ శివార్లలోని ఖాళీస్థలాలు, వ్యవసాయ భూములు, వెంచర్లు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రధానంగా వైన్‌షాపులు ఉన్న మండలంలోని స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఘన్‌పూర్‌లోని పోచమ్మ దేవాలయం వద్ద కూడా మద్యం తాగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఘన్‌పూర్‌లో పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపాన, రైల్వే బ్రిడ్జి వద్ద, శివునిపల్లిలో పాలకుర్తి రోడ్డులో, నమిలిగొండ రోడ్డులో, పాంనూర్ రోడ్డులో ఎక్కడ చూసినా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారు అనునిత్యం దర్శనమిస్తున్నారు. డివిజన్ కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల వెనుకవైపు ప్రహరీ లేక పోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. అదేవిధంగా నమిలిగొండ, విశ్వనాథపురం, ఇప్పగూడెం, సముద్రాల, తానేదార్‌పల్లి, రంగరాయగూడెం, మీదికొండ, తాటికొండ, కొత్తపల్లి తదితర గ్రామాల్లో పలు తోటలు, వ్యవసాయ భూములు, గుట్ట ప్రాంతాలు మందుబాబులకు అనుకూలంగా ఉండటంతో విచ్చలవిడిగా మద్యం తాగుతున్నారు. దాంతో అటుగా వెళ్ళే ప్రజలు, రైతులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి రిజర్వాయర్ కట్టకు..

ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో సమృద్ధిగా నీరు, విశాలమైన రిజర్వాయర్ కట్ట, చుట్టూరా చెట్లతో ఆకర్షణీయంగా ఉండగా ఈ ప్రాంతం మందుబాబులకు ప్రధాన అడ్డాగా మారింది. ఘన్‌పూర్ చుట్టుపక్కల వారే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన మద్యం ప్రియులు రిజర్వాయర్ కట్టపైకి వచ్చి మద్యం తాగుత్తున్నారు. ఏది ఏమైనా ఈవిషయమై స్థానిక పోలీసులు నిఘా పెంచాలని, బహిరంగ మద్యపానాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాలు అపవిత్రం



శివారు ప్రాంతాల్లోని ఆలయాల పరిసరాల్లో కొందరు బహిరంగంగా మద్యం తాగుతూ పవిత్ర ఆలయాలను అపవిత్రం చేస్తున్నారు. తాగిన సీసాలు, గ్లాసులు అక్కడే పారవేస్తున్నారు. దీంతో ఆలయాలకు వెళ్లే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు.

- గన్ను నర్సింహులు, మాజీ ఎంపీటీసీ, స్టేషన్‌ఘన్‌పూర్

వ్యవసాయ భూముల వద్ద సీసాలు పగులగొడుతున్నారు



వ్యవసాయ భూముల వద్ద మద్యం తాగిన మందుబాబులు అక్కడే సీసాలు పగులగొడుతున్నారు. దాంతో వ్యవసాయ పనులకు వచ్చే రైతులకు, పశువులకు సీసా వక్కలు గుచ్చుకుని తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానాన్ని అరికట్టాలి.

- లింగనబోయిన శ్రీను, రైతు, ఇప్పగూడెం

కఠిన చర్యలు తప్పవు



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవు. ఇప్పటికే నిరంతరం పెట్రోలింగ్ చేయిస్తున్నాం. బహిరంగంగా మద్యం తాగితే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. అవసరమైతే మరింతగా నిఘా పెంచి బహిరంగ మద్యపానాన్ని అరికట్టేలా చర్యలు చేపడతాం.

- జి.వేణు, సీఐ

24 గంటల కరెంట్ ఇప్పించండి



కొమ్మూరికి వినతిపత్రం అందజేస్తున్న నర్సిరెడ్డి

జనగామ: జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించి, ఏడేళ్ల సమస్యకు పరిష్కారం చూపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ బావులతో పాటు ఊరికి ఒకే ఒక్క ఫీడర్ ఉండడంతో తరచూ కరెంట్ సరఫరా నిలచిపోతుందన్నారు. అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఉదయం వరకు పునరుద్ధరించడం లేదన్నారు. వ్యవసాయ బావులకు ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బనుక శివరాజ్, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ మిద్దె పాక సిద్దులు, గ్రామశాఖ అధ్యక్షుడు కుర్రెముల రవి కుమార్, సుదగాని భిక్షపతి, కొంతం సత్తయ్య, వల్లూరి సిద్దులు, మిద్దెపాక మహేందర్, హనుమాన్ పాల్గొన్నారు.

సన్మానం



దేవరుప్పుల: మండలంలోని పెద్ద మడూరులో మల్లికార్జున గజానన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రోత్సవాలకు సామాజిక సేవకుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శాశ్వత విగ్రహ దాత బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్‌ను ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించి ఉత్సవ లడ్డూ ప్రసాదం అందజేశారు. రాజకీయాలకతీతంగా గత తొమ్మిదేళ్లుగా ఆదిదేవుడు వినాయకుడి విగ్రహాన్ని ఇప్పిస్తూ ఆధ్యాత్మికత చింతన కోసం తోడ్పాటు అందిస్తున్న బబ్బూరిని గ్రామస్తులు అభినందించారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ వితరణ



బ్యాగులు అందజేస్తున్న ప్రజ్యోత్

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాలిన్స్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధి వంగాల ప్రజ్యోత్ శనివారం స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, స్టేషనరీని వితరణ చేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవిలత తనయుడు, సంస్థ ప్రతినిధి ప్రజ్యోత్ పాఠశాల విద్యార్థులందరికి అందజేసి దాతృత్వం చాటారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రజ్యోత్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యను ఆసక్తిగా అభ్యసిస్తూ లక్ష్యాలను ఎంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ అలవర్చుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజ్యోత్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. హెచ్‌ఎం దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జానకిదేవి, సుదారాణి, మాధవిలత, సరిత, వనజ పాల్గొన్నారు.

ఎన్నిక



అంజయ్య

నర్మెట: మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయ కమిటీ చైర్మన్‌గా బూస అంజయ్య ఎన్నికయ్యాడు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన గ్రామస్తులు అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, 2014లో నిర్మించిన ఆలయంలో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో గంగం నర్సింహారెడ్డి, ప్రెజ్ఞాపురం అంజయ్య, జంగిటి అంజయ్య, చింతకింది సురేష్, గోపగోని శ్రీధర్, పులి శ్రీనివాస్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, మల్లాడి కృష్ణా రెడ్డి, జంగిటి అంజయ్య పాల్గొన్నారు.

చెరువు వద్ద పూజలు

చిల్పూరు: సాగునీటి వసతులు లేని మండలంలో లింగంపల్లి కయ్యచెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నిండిపోయింది. కాగా, గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు ఏదునూరి రవీందర్ ఆదివారం చెరువుకట్ట వద్ద నీటికి పూజలు చేశారు. కార్యక్రమంలో బాలకిష్టయ్య, ఎలేంద్రం, మట్ట రమేష్, బుచ్చిరాజు, కండ్లకోలు రాజయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

గోల్డెన్ జూబ్లీ వేడుకలకు సన్నాహక సమావేశం

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి నాగమల్ల అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి 1973–74 నుంచి 2023–24 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా త్వరలో ఇదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నట్లు, ఈ పాఠశాలలో ఆయా విద్యాసంవత్సరాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిట్ట రాజు, మూల ప్రమోద్, నరేందర్, వాసుదేవరావు, లక్ష్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ఈగ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆదర్శ అధ్యాపకుడు శ్యాంప్రసాద్



పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ ఉత్తమ సాహితీవేత్త, ఆదర్శ అధ్యాపకుడు అని భారతీయ విద్యాభవన్ సంస్థల సలహాదారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మదన్‌రావు అన్నారు. ఇటీవ పదవీ విరమణ పొందిన శ్యాంప్రసాద్‌ను ఆదివారం ఆయన కలిసి అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొడకండ్ల: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కున్సోత్ బాబునాయక్ భార్య మంగమ్మ మృతి చెందింది. కాగా, ఆదివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ మండల నాయకులు పరామర్శించారు. మంగమ్మ మృతదేహానికి సురేష్‌నాయక్, రామోజీ, పేరం రాము తదితరులు పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అమరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సోమాని, రాంకోటి, ఉప్పలయ్య, కుమార్, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని కామారెడ్డిగూడేనికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ అప్పిడి యాదవరెడ్డి తండ్రి సోమిరెడ్డి మృతి చెందాడు. కాగా, పలువురు ఆదివారం సోమిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, నాయకులు రవీందర్, బిల్లా తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ బిల్లా అంజమ్మ యాదవరెడ్డి, ఈదునూరి నర్సింహ్మారెడ్డి ఉన్నారు. కాగా, శనివారం రాత్రి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. పల్ల సుందర్ రామిరెడ్డి, దయాకర్ తదితరులు ఉన్నారు.

నేడు తహసీల్‌లో ప్రజావాణి

కొడకండ్ల: ప్రతి సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కోల చంద్రమోహన్ తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు మెగా వైద్యశిబిరం

నర్మెట: మండలంలోని గండిరామారంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు గద్దల అరుణా కిశోర్ తెలిపారు. ఎముకలు కీళ్ల సంబంధ వ్యాధుల, రక్తపరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించబడతాయని అన్నారు. హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహింపబడుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రయవిక్రయదారుల వివరాలను ఇవ్వాలి



చిల్పూరు: ఇటీవల పశువులు, గొర్రెలు, మేకల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున అంగడికి వచ్చే పశువుల క్రయవిక్రయదారుల వివరాలు పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలని కానిస్టేబుల్ యాదగిరి అంగడి నిర్వాహకుడు మేల నాగరాజుకు సూచించారు. స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం అంగడిలో పశువుల, గొర్రెలు, మేకల యజమానులు, అమ్మకం దారులు, నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటేలా పార్టీ శ్రేణులు అంకిత భావంతో పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేశ్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్లు మారపాక రవి, ఆకుల కుమార్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టడం తదితర అంశాలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని, ఎన్నికల ముందు చేసిన హామీలను విస్మరించి ప్రజలను దగా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలని, బీఆర్ఎస్‌ను క్షేత్రస్థాయిలో మరింతగా పటిష్ఠం చేయాలన్నారు. మార్కెట్‌కమిటీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, పార్టీ మండల కోఆర్డినేటర్ అక్కిరెడ్డి ఆగారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కనకం గణేశ్, గుర్రం శంకర్, మారెపల్లి ప్రసాద్, గుర్రం యేసుబాబు, గాదె రాజు, గుండె మల్లేష్, ఒగ్గు రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మందులు పంపిణీ చేస్తున్న ప్రసాద్‌శర్మ

దేవరుప్పుల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చండీ పరమేశ్వరి పీఠం వ్యవస్థాపకుడు, డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ అన్నారు. ఆదివారం మండలంలోని కామారెడ్డిగూడెంలో చండీపరమేశ్వరి పీఠం, పాలకుర్తి హరిత హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత చేకూర్చినప్పుడే దోమలు వ్యాప్తి అరికట్టగలుగుతామని, తద్వారా విషజ్వరాలు తమ దరికి చేరవన్నారు. అనంతరం వైద్యులు పలువురికి చికిత్సలు చేసి అవసరార్థులకు మందులు పంపిణీ చేశారు. వైద్యులు హరిత, సంజయ్, శ్రీచండీ పీఠం ట్రస్ట్ చైర్మన్ సత్యవాణి, వనమాల సోమలింగం, బుక్కరామయ్య, శ్రీధర్, మొలుగూరి రమేశ్, రత్నాకర్, వరప్రసాద్, గారు కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న బాధితులు

చిల్పూరు: ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమి సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని బాధితులు గ్రామ పెద్ద దేవేందర్ ఇంటి ఎదుట రోడ్డుపై ధర్నా దిగిన సంఘటన మండలంలోని కొండాపూర్‌లో చోటుచేసుకుంది. జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, బాధితులు అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన కుంచ కార్యవర్ధిరాజు, శివరాత్రి చినరాజయ్య 2011లో ఇదే గ్రామానికి చెందిన పసునూరి నరేందర్‌రెడ్డి వద్ద 180ఏలో ఇద్దరు కలిసి ఒక్కో ఎకరం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి నేటికి కాస్తులోనే ఉన్నారు. 2015లో గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి వారికి అమ్మిన భూమిని తనకు అమ్మాలని కూతురు నితిక పేర రిజిస్ట్రేషన్ చేయించాడు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే పంటలు సాగు చేసుకుంటున్నారు. మూడు నెలలు అవుతున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆదివారం రోడ్డుపై వారి వాహనాలను అడ్డుగా పెట్టి ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిల్పూరు, స్టేషన్ ఘన్‌పూర్ ఏఎస్సైలు నవీన్‌కుమార్, వినయ్‌కుమార్, సిబ్బంది చేరుకున్నారు. కాగా, ఎమ్మార్పీఎస్, సీపీఐ నాయకులు బాధితులకు సంఘీభావం ప్రకటించారు. సీఐ మంగళవారం వరకు న్యాయం జరిగేలా చేస్తానని బాధితులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యవర్ధిరాజు, రాజ్‌కుమారస్వామి, శివరాత్రి విజయ, సంపంగి మమత–రాజ్‌కుమార్, గణేశ్ తదితరులు ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిల్పూరు: సమ్మేళనంలో పాల్గొన్న బీఎడ్ పూర్వవిద్యార్థులు



సమ్మేళనంలో 1986-87 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

పాలకుర్తి: మండలంలోని గూడూరు జెడ్పీఎస్ఎస్ 1986–87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. బొబ్బాల వెంకటరెడ్డి, ఉల్లి రమదేవి పూజారి చంద్రుడు, రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

రాజవరంలో..

చిల్పూరు: హనుమకొండ ప్రభుత్వ బీఈడీ కళాశాల 1992–93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మండలంలోని రాజవరం తన్మయ రిసార్ట్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, శంకర్, సీఐ శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ రియాజ్, సీనియర్ ఉపాధ్యాయులు అన్వర్, శ్రీనికాంత్, కందగట్ల సురేష్, డాక్టర్ చంద్రశేఖర్, నివేదితరెడ్డి, ఇందిరలక్ష్మి, బీఎడ్ కళాశాల అధ్యాపకుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను విస్మరిస్తున్న ప్రభుత్వం



బచ్చన్నపేట: మాట్లాడుతున్న విజేందర్



జనగామ రూరల్: మాట్లాడుతున్న యాదగిరి

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులు, పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ అన్నారు. మండలంలోని నక్కవాని గూడెంలో గొలన్‌కొండ ఈదమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, నాయకులు అన్నెబోయిన రాజు, తాడెం రాములు, గుండ రవి, కిష్టయ్య, బాలరాజు పలువురు పాల్గొన్నారు.

షరతులు లేకుండా పంట రుణాలు ఇవ్వాలి

జనగామ రూరల్: రైతులందరికీ షరతులు లేకుండా ప్రభుత్వం పంటరుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబరాజు యాదగిరి డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్లంల గ్రామంలో కార్యదర్శి యాదయ్య అధ్యక్షతన గ్రామ శాఖ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడారు. ఉపేందర్, నరేందర్, సత్తయ్య, నాగరాజు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పాలకుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు రమేశ్ అన్నారు. ముస్కు ఇంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన దర్దేపల్లి గ్రామ శాఖ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, వేల్పుల దామోదర్, తోటరాజు వేల్పుల సాంబాజి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీఎం గ్రామ కార్యదర్శి కాంద్రారెడ్డిని ఎన్నుకున్నారు.

'రాహుల్‌గాంధీకి బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: ఏఐసీసీ అగ్రనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ పేరు ఉచ్చరించే హక్కు బీజేపీకి ఎంతమాత్రం లేదన్నారు. బీజేపీ నేతలు వెంటనే రాహుల్‌గాంధీకి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, కొలిపాక సతీష్, మంతెన ఇంద్రారెడ్డి, దుంపల పద్మారెడ్డి పాల్గొన్నారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మభిక్షం

జనగామ రూరల్: విద్యాశాఖలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. ఆదివారం జిల్లా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన అక్రమ డిప్యూటేషన్లు, ఏకరూప దుస్తుల గోల్‌మాల్ వ్యవహారంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ విచారణ జరిపిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కళాశాల, పాఠశాలల్లో మరుగుదొడ్లు, తదిరత సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలు పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సాగర్, రాజ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.